## బోరు బావి పునరుద్ధరణ పనులకు నార్కొట్



జుక్కల్ , బతుకమ్మ : జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద బోరుబావి పునరుద్ధరణ పనులకు జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ మారుతి నార్కొట్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. తహశీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల వద్ద బోరుబావిని పునరుద్ధరించేందుకు వీబీజీ రామ్ జీ పథకంలో భాగంగా బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ పథకాన్ని ప్రారంభించారు. దీని ముఖ్య ఉద్దేశం బోరు బావిలో భూగర్భ జలాలను పెంచే పద్ధతిలో భాగంగా అందుబాటులో ఉన్న స్వచ్ఛమైన నీటిని, వృధా చేయకుండా వడపోత చేసి బోర్వెల్ లోపలికి పంపిస్తారు. ఇలా చేయడం వలన భూగర్భ జలు పెరిగి, ఎండిపోయిన బోర్లు తిరిగి నీరు పోయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ పనులను చేసే ముందు బోర్వెల్ చుట్టూ పొడవు, వెడల్పు, లోతు గుంతను తీసి రాళ్లు, కంకర, ఇసుకను, వరుస క్రమంలో అమరుస్తారు. వర్షపు నీరు లేదా పైకప్పు మీద నుండే నీటిని ఈ గుంతలోకి మళ్లిస్తారు. ఆ నీరు ఇసుక రాళ్ల గుండె పోయి వడపోయబడి స్వచ్ఛందంగా బోరులోకి చేరుతుంది. ఈ ప్రక్రియ వలన బోరుబావి వట్టిపోకుండా ఉండడమే కాకుండా నిరంతరంగా నీటిని పంపించడం జరుగుతుంది. ఈ విధానాన్ని బోర్వెల్ లో ఉన్న ప్రతి ఒక్క గ్రామాలలో ఈ పథకం అనుసరించి వినియోగంలోకి తీసుకువచ్చి భూగర్భ జలాలు పెంచే విధంగా తోడ్పాటున అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయా గౌడ్ , ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ మారుతి,నార్కొట్ డిప్యూటీ తాసిల్దార్ హేమలత, ఆర్ ఐ మోహన్, మండల పరిషత్ సూపరిండెంట క్రాంతి కుమార్ , ఎంపీ ఓ రాము, ఏపీవో తులసి రామ్, ఈసీ స్వామి దాస్, టి ఏ లు రమేష్ , రవీందర్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీఎం అభినందనలు



హైదరాబాద్, బతుకమ్మ :నీట్ పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీట్‌లో సాధించిన విజయాలపై సీఎం విద్యార్థులను అభినందించి, వారి భవిష్యత్ విద్యా ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు. గురుకుల విద్యా సంస్థలు అందిస్తున్న నాణ్యమైన విద్య, విద్యార్థుల ప్రతిభను సీఎం ప్రశంసించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. టీజీఎస్ డబ్ల్యూఆర్ఈఐఎస్ విద్యార్థులు జాతీయ స్థాయి వైద్య ప్రవేశ పరీక్షలో మంచి ఫలితాలు సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, సిబ్బందిని కూడా అభినందించారు.

## బయటి ఆహారం ఎక్కువగా తింటున్నారా.. అయితే జాగ్రత్త..

వర్షాకాలంలో జీర్ణాశయ, పేగుల ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం గణనీయంగా పెరుగుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ కాలంలో అతిసారం, వాంతులు, కడుపు నొప్పి, ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలతో ఆస్పత్రులకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వర్షాల కారణంగా తాగునీటి వనరులు కలుషితమవడం, బ్యాక్టీరియా, వైరస్‌లు, పరాన్నజీవులు వేగంగా వ్యాప్తి చెందేందుకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉంటాయి.వర్షాకాలంలో అధిక తేమ, తడి వాతావరణం కారణంగా సూక్ష్మజీవులు వేగంగా వృద్ధి చెందుతాయి. భారీ వర్షాల సమయంలో మురుగునీరు తాగునీటిలో కలిసిపోవడం వల్ల జీర్ణాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్ల ప్రమాదం మరింత పెరుగుతుంది. పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఈ ఇన్‌ఫెక్షన్లకు ఎక్కువగా గురవుతారు. వర్షాకాలంలో ఆహారం సులభంగా కలుషితమవుతుంది. సరిగా నిల్వ చేయని ఆహారం, పూర్తిగా ఉడకని పదార్థాలు లేదా అపరిశుభ్ర పరిస్థితుల్లో తయారైన ఆహారంలో బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది.

# మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి

### బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ :మృతి చెందిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. గత నాలుగేళ్లుగా మృతి చెందిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు రావాల్సిన ఇన్సూరెన్స్, పీఎఫ్, పెన్షన్ తదితర ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలు ఇన్సూరెన్స్, పీఎఫ్, పెన్షన్ కోసం మున్సిపల్ కార్పొరేషన్, పీఎఫ్, ఈఎస్ఐ కార్యాలయాల చుట్టూ సంవత్సరాలుగా తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. దశాబ్దాల పాటు తక్కువ వేతనాలతో సేవలందించిన కార్మికుల కుటుంబాలను నిర్లక్ష్యం చేయడం అన్యాయమని



ఆయన పేర్కొన్నారు. మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక ప్రయోజనాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు. మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సంబంధించిన ఇన్సూరెన్స్, పీఎఫ్, పెన్షన్ పెండింగ్ ఫైళ్ల పరిష్కారం కోసం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. అలాగే మృతి చెందిన, వయోభారం లేదా అనారోగ్య కారణాలతో విధులు నిర్వహించలేని కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించేలా కార్పొరేషన్ తీర్మానం చేసి సీడీఎంఏకు పంపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికులకు రెయిన్‌కోట్లు, యూనిఫాంలు, షూలు, గ్లౌజులు, నాణ్యమైన పనిముట్లు వెంటనే అందించాలని, జీవో నంబర్ 52 ప్రకారం రిజిస్ట్రేషన్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్న కార్మికులకు ఆగస్టు నెల నుంచి గ్రూపుల ద్వారానే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు కాంబ్లే మధు, జిల్లా గౌరవ అధ్యక్షురాలు సబ్బని లత, బీఎల్‌టీయూ వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. వినతిపత్రం స్వీకరించిన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# ఇందల్వాయిలో ఘనంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

### హరే రామ హరే కృష్ణ నామస్మరణతో మార్మోగిన గ్రామం

ఇందల్వాయి, బతుకమ్మ :ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామంలో శనివారం శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇస్కాన్ కంటేశ్వర్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రథయాత్రను గ్రామ సర్పంచ్ లోకని గంగామణి గంగారం, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) చైర్మన్ రియాజ్, రథయాత్ర కమిటీ సభ్యులు కలిసి ప్రారంభించారు. ఈ రథయాత్రకు వివిధ మండలాలు, గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శ్రీ జగన్నాథ స్వామి రథాన్ని లాగుతూ భక్తులు "హరే రామ హరే కృష్ణ" నామస్మరణ చేస్తూ భక్తి భావంతో పాల్గొన్నారు. డప్పు వాయిద్యాలు, భజనలు, కీర్తనలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి సంవత్సరం నిర్వహించే ఈ శ్రీ జగన్నాథ రథయాత్ర ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని, అనంతరం ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. రథయాత్ర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ



సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై బి. సుమలత ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. భక్తులు సంయమనం పాటిస్తూ రథయాత్రలో



పాల్గొనాలని అధికారులు సూచించారు. రథయాత్ర ముగిసిన అనంతరం భక్తుల కోసం గంగపుత్ర ఫంక్షన్ హాల్‌లో భోజన ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులందరూ గమనించి సహకరించాలని వారు కోరారు.

# మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

### స్పెషల్ ఆఫీసర్ అరవింద్ రెడ్డి

రుద్రూర్, బతుకమ్మ :ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్ అరవింద్ రెడ్డి సూచించారు. రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలను శనివారం స్పెషల్ ఆఫీసర్ అరవింద్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అదేవిధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పలు విషయాల పై చర్చించారు. ఆయన వెంట ఎంఈఓ రామ్ సింగ్, ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీఓ అరవింద్, పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్ దాస్ తదితరులు ఉన్నారు.



# ఆదర్శ పాఠశాలలో విద్యార్థినీలకు తప్పని వేధింపులు

### ఇద్దరు కాంట్రాక్ట్ టీచర్‌ల విధుల నుంచి శాశ్వతంగా తొలగింపు

బాన్సువాడ, బతుకమ్మ:కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం లోని మోడల్ స్కూల్ లో పనిచేస్తున్న గోపాల్, పవన్ అనే ఇద్దరు కాంట్రాక్ట్ టీచర్ లను శాశ్వతంగా విధుల నుంచి తొలగించినట్టు కామారెడ్డి డిఇఓ మల్లిఖార్జున్ తెలిపారు. ఒప్పంద ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం తోపాటు,వేధింపులకు పాల్పడుతున్న విషయాన్ని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ జరిపి ఒప్పంద ఉపాధ్యాయులు గోపాల్, పవన్ విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తేలడంతో వారిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించినట్లు జిల్లా విద్యాధికారి మల్లికార్జున్ తెలిపారు. విద్యార్థినిలు పట్ల లైంగిక వేధింపుల ఘటన పై పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కొందరు ఉపాధ్యాయులు ఈ విషయంను బయటకు పొక్కనీయకుండా చేసి వివాదం సద్దుమనిచేందుకు యత్నించినట్లు తెలిసింది.